# శ్రీబాబు

"వల్లరి"

శ్రీబాబు యింటికి బయలుదేరాను. శ్రీబాబు ఆ యిద్దరు పిల్లలచేతా గోడకుతగిలించివున్న ఫోటోలకు నమస్కారం చేయిస్తున్నాడు.

"ఓహో—కేశవుడా—కూర్చో" అన్నాడు నారాక అద్దంలోంచి చూసి.

"బాబాయ్—కాఫీ పట్టుకువస్తాం" అని వెళ్ళిపోయారాపిల్లలు.

నాకు ఆశ్చర్యం కల్గినమాట నిజం. ఎంచేతనంటే నేను శ్రీబాబుని చూసి చాలాకాలమయింది. సెలవుమీద నిన్ననే యీవూరు వచ్చాను. అంచేత నా సందేహకారణం అసహజం కాదని తలుస్తాను.

వంటవాడు కాఫీ 'ట్రే' తీసుకువచ్చి మా ముందుపెట్టాడు. కాఫీ 'సిప్' చేస్తూ అడిగాను "శ్రీబాబు—మఱి—నాకు తెలియకుండా వివాహం యెప్పుడు చేసుకున్నావ్—మొన్నటివరకూ బ్రహ్మచారిలా సంచరించావ్!"

"ఆ—అదివేరు సంగతి—కాని యీ పిల్లల సంగతి గుఱించి నీవు చాలా పొరపడుతున్నావ్. నేను పూర్వపు బ్రహ్మచారినే" అన్నాడు.

"—మఱి యీపిల్లలు..." అన్నాను

"ఓ స్నేహితుని బిడ్డలు— అయితే వీరిని పోషించే బాధ్యత ఎందుకు ఎలా పడిందిఅని ప్రశ్నించవద్దని ప్రార్థన— మన్నించు" అని కుర్చీలోంచి లేచాడు. శూన్యాకాశాన్ని చూస్తూ కిటికీవద్ద నుంచున్నాడు.

"శ్రీబాబు— నీ హృదయానికి చాలానొప్పి కల్గించినందుకు విచారిస్తున్నాను. క్షమించు. నీకు యిష్టమయితే సాయంకాలం బీచీలో కలుసుకొంటాను" అని దగ్గరకువెళ్ళి భుజంమీద చేయివేసి అన్నాను.

"తప్పకుండా—నేనూ అదే కోరుతున్నాను" అన్నాడు.

చేతిగడియారం ఆరుచూపింది. బీచీ ఇసుక తిన్నెమీద కూర్చున్నాను శ్రీబాబురాక కెదురు చూస్తూ. జాడ ఎక్కడా లేకపోవడంచేత రాడేమోననుకున్నాను.

సముద్రపు కెరటాలు వంపులు వంపులుగా వొడ్డుకు ఢీకొట్టుకొంటూ తమ వినీల రంగుల్ని పోగొట్టుకొంటూన్నాయ్. తెల్లటి నీటి నురగలు యేర్పడి తిరిగి వెనక్కి పోతూన్నాయ్. పైరగాలి తరంగాలలో ప్రకృతి మార్దవమూర్తియై నిలిచింది. నామదిలో యేన్నోవూహాలు సంకుల సంచారం ప్రారంభించాయ్. నా ప్రాణస్నేహితుడైన శ్రీబాబు ఈనాడు—ఇంత వికృతంగా నాతో ప్రవర్తిస్తాడనుకోలేదు. అలా ప్రవర్తించేందుకు కారణం బలవత్తరమైవుండాలి, లేకుంటే దరహాస రేఖల్ని వెదజల్లే ఆతని ముఖకాంతి విచారరేఖలతో క్రమ్మివుండేందుకు కారణం?—ఆనాడు నన్ను సాగనంపేందుకు రైలుస్టేషనుకు వచ్చినప్పుడు "నీవు తొందరలోనే నా వివాహానికి రావలసివుంటూవు" అన్న శ్రీబాబు యింతవఱకూ బ్రహ్మచారిగా వుండేందుకు కారణం?.....యిలా యెన్నోప్రశ్నలు వొకదాని వెంబడే వొకటి సముద్రపుటలలా వస్తూన్నాయ్!

భుజంమీద చేయిపడడంవల్ల వెనక్కి తిరిగి చూసాను. శ్రీబాబు. నీవువచ్చి ఎంతసేపయిందని ప్రశ్నించాను.

శ్రీబాబు నావంకే చూస్తున్నాడు. యేదో చెప్పదలచుకొని వెనుకంజ వేస్తూన్నట్లు ద్యోతకమవుతోంది. "శ్రీబాబు—నీ ప్రవర్తన చాలవింతగా వుంది. నీ హృదయంలో యేదో బాధాకర విషయం వున్నట్లు తోస్తోంది. నేను—నీ ప్రాణస్నేహితుడనని తెలిసికూడా చెప్పేందుకు సందేహిస్తూన్నావ్. కారణ మేమయివుంటుందో, నాకు తెలియకుండా వుంది" అన్నాను.

"అవును కేశవా—ప్రొద్దున్నటి నా విపరీత ప్రవర్తన నాకే ఆశ్చర్యం కల్గించింది. క్షమించు. హృదయగ్గతమయిన బాధ ఇతరులకు చెప్పడంవల్ల హృదయభారం తగ్గుతుందంటారు. అంచేతనే నిన్ను ఇక్కడకు రమ్మన్న కారణం.

యిక విను.........

“ఆనాడు ఇందిరాదేవి వచ్చింది. ఆమె భర్త నా స్నేహితుడు. అతడు అకస్మాత్తుగా చనిపోయాడు. మఱి ఆమె నావద్దకు రావటానికి కారణం యేమంటే దిక్కులేని ఆ పిల్లలపై కొంతదయ చూపమని నా సహాయ మపేక్షించింది. ఒడిపట్టింది. అప్పుడు నేనన్నమాటలు చాలా సిగ్గుగల్గిస్తున్నాయ్. అంత తెలివితక్కువగా ప్రవర్తిస్తానని అనుకోలేదు.

అప్పుడు నేనన్నాను—డబ్బుకేం, డబ్బు సంపాదించడం అంతకష్టంకాదు. నా సహాయం అపేక్షించవలసిన అగత్యం రాలేదు. డబ్బువస్తుంది. అదీగాక సంగీతంవచ్చు. వయస్సు, శక్తివుంది—స్వతంత్ర జీవనమే చేయవచ్చు—అంతే!

ఆమె వెళ్ళిపోయింది. తిరిగి కనిపించలేదు. ఆమె తాలూకు రెండు కన్నీటిచుక్కలు మాత్రం వదలిపెట్టి వెళ్ళింది. ఆ ఋణం యేజన్మలోనో తీర్చలేననుకుంటాను.!

ఆమె నన్ను పూర్తిగా తప్పర్థం చేసుకొన్నది. చనిపోయేముందుకూడా నా విన్నప మాలకించేందుకు యిష్టపడలేదు. ఆమె ఆత్మఅయినా క్షమిస్తుందా.!!

నేను విచారిస్తున్నాను. ఇంతచదువు చదివినా కూడా నే చెప్పేమాటల్ని సవ్యంగా, విపులంగా చెప్పలేకపోయాను. నా వుద్దేశంలో ఆమె నన్ను యాచించ నవసరమేలేదని. ఎందుకంటే ఆమె పతి తాలూకు ప్రావిడెంటుఫండు, వంటి యితరమైన ధనం కొంతనిల్వవుంది. అదీకాక ఆమె యింకా ముసలిదవలేదు. శక్తివున్నది. సంగీతశాస్త్రం వచ్చు. కాబట్టి సంగీతం చెప్పకొని సంపాదించుకోవచ్చు. స్వచ్ఛందంగా బ్రతుకవచ్చు. అలా నిశ్చలముగా, హాయిగా స్వసంపాదనమీద సుఖించే సదుపాయ మున్నప్పుడు అనవసరంగా నావద్దవుండి అనాగరికమైన యీపాడు మూర్ఖులతో నీతిలేని మాటలను యెందుకు కోడై కూయించుకోవాలని నావుద్దేశం. కాని—యీ విషయం సూక్ష్మంగా, కొన్నిమాటల్లో చెప్పాలని; అది ఆమె అర్థంచేసుకోగలదనే నా తెలివిలేమిపూహ యింతపనిచేసింది. ఆమె జీవాన్నే నాశనంజేసింది. నేను చాలా విచారిస్తున్నాను నా తెలివితక్కువకు. బాధపడుతోన్నాను. యెంతో పశ్చాత్తాప పడుతున్నాను. యేంలాభం. కాలిన వ్రేలును నోట్లోపెట్టుకోవడమే.!

..................

ఆ అమానుష సంఘటన జరిగిన షుమారు నెల రోజులకు నేను షికారు వెళ్తూన్నాను. రోడ్డుప్రక్క పేవ్‌మెంట్‌వద్ద ముగ్గురుపిల్లలు జీర్ణవస్త్రాలతో—ధూళిదూసరమైన శరీరాల్తో—ముష్టి అడుక్కొంటూన్నారు. అందులో పసివాడు చిల్లిపింగాణీగిన్నె చూచాడు. కాని—పెద్దవాడు కొప్పడి నేనివ్వబోయే పైస నిరాకరించాడు,

నామనస్సులో యేదోవిధంగావుంది. అప్రయత్నంగా—మీయిల్లు యెక్కడ? అన్నాను.

పడిపోవడానికి సిద్ధంగావున్న గుడిసెలోనికి తీసుకువెళ్ళారు నన్ను. మంచంపై స్త్రీవొకర్తె శల్యావస్థలోవుంది. నేను గుర్తించలేకపోయాను. కాని ఆమె నన్ను గుర్తించింది. వెంటనే కళ్లు మూసుకొంది నా దృష్టినుండి తప్పుకొనేందుకు. పిల్లల్ని తనదగ్గరకూ పిలిచింది. వాళ్లు “అమ్మా” అంటూ వెళ్ళి హృదయంమీద పడుకొన్నారు కౌగలించుకొని.

ఆ నిర్భాగ్యజీవులు యీ సంఘంలో బ్రతకడం దుర్లభమనుకున్నదేమో—ఆ పసిబిడ్డలను అష్టకష్టాలకు వదిలేకంటె తనవెంటే తీసుకువెళ్లడం మంచిదనుకున్నదేమో—చూస్తూండగానే ఆమె వొకపిల్లవాని కంఠంగట్టిగా నులిమివేసింది.—రెండవవాని ప్రయత్నించే లోపలనే ఆమె చేతులు వ్రేలాడిపోయాయి. తనబిడ్డడితో తనూ తనువు చాలించింది.

....................

అని కథముగించాడు. శ్రీబాబు కళ్లవెంబడి అశ్రుబిందువులు జలజలరాలాయ్. నిశ్చేష్టుడై శిలావిగ్రహంలా చలనవిహీనుడయ్యాడు.

హోరుగాలి వీస్తోంది. కాఱుమబ్బులు క్రమ్మేయ్. కనుమరుగని చీకటి! వర్షం జోరుమని కురుస్తోంది. చేతిలో చేయికలిపి నడిచాం.